క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎమ్మెల్యే ప్రసన్నకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేష్‌రెడ్డి, పార్టీ నేతలు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ అగ్రికల్చర్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, గురజాల బుజ్జిబాబు, భాను చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అద్దంకి మమత, ప్రసాద్‌రెడ్డి, రాజా, వాసు, చక్రి పాల్గొన్నారు.

నేడు బిరదవోలుకు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం 10.40 గంటలకు బిరదవోలు గ్రామానికి వస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ శుక్రవారం తెలిపారు. సచివాలయ భవనం, సిమెంటురోడ్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించే సమావేశంలో మంత్రి మాట్లాడుతారని వెల్లడించారు. మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాల్సిందిగా సూచించారు.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఏబీ మండలాధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

కోవూరు : రైతులకు అవసరమైన పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న రైతుభరోసా కేంద్రంలో మండల ఏఏబీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. మండల ఏఏబీ అధ్యక్షుడు ఎస్.హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తుపాన్ వల్ల నష్టపోయిన ఉద్యానవన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులురెడ్డి, ఏఓ ఇందిరాపతి, వ్యవసాయ సహాయకులు చైతన్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు సబ్ ట్రెజరీ భవనానికి శంకుస్థాపన



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ట్రెజరీ అధికారులు

కోవూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు రూ.1.8 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన సబ్ ట్రెజరీ కార్యాలయ భవనానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని కోవూరు సబ్ ట్రెజరీ అధికారి కిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ట్రెజరీ అధికారి డి.గంగాధర్‌తో కలిసి కోవూరు తహసీల్దార్ విజయశ్రీతో పలు విషయాలపై చర్చించారు. గతంలో ఈ కార్యాలయ భవనానికి స్థలం మంజూరైందని, ప్రస్తుతం భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతోందన్నారు.

పనులను వేగవంతం చేయాలి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీసీఏఓ తిరుపతయ్య

కోవూరు: ప్రాథమిక సహకార సొసైటీల్లో వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీసీఏఓ తిరుపతయ్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీ పరిధిలో సభ్యులుగా ఉన్న రైతులు తమ పొలానికి సంబంధించిన డాక్యుమెంట్ జిరాక్స్‌లు, పాస్‌బుక్కు, ఆధార్, రెండు ఫొటోలను సంబంధిత సొసైటీ కార్యాలయంలో అందజేస్తే పనులు వేగవంతం అవుతాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగులకు చెక్

• అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ



ఇందుకూరుపేట: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

ఇందుకూరుపేట: నులి పురుగులతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆల్బెండజోల్ మాత్రతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని ఆదెమ్మసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నులిపురుగుల వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు ఆల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రలను మింగాలని సూచించారు. నులి పురుగులను నిర్మూలిస్తే విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, క్రీడల్లోనూ చురుగ్గా రాణిస్తారని వివరించారు. కార్యక్రమంలో జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కిశోర్, బ్రహ్మేశ్వరనాయుడు, జిల్లా కో–ఆర్డినేటర్లు శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం రాజేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్లు సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేటలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో ఎంపీడీఓ నాగరాజు పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.రోజారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ మాత్రలతో ఆరోగ్యం

కొడవలూరు: చిన్నారులు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు డీవార్మింగ్ మాత్రలు దోహద పడుతాయని తహసీల్దార్ పి.శైలేంద్రకుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల చిన్నారుల్లో రక్తహీనత సమస్య ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విధిగా డీవార్మింగ్ మాత్రలు తీసుకోవాలన్నారు. అనంతరం నులి పురుగులతో తలెత్తే అనారోగ్య సమస్యలపై వైద్యాధికారి జి.బాలచంద్రబాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం శేషుబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిక్కిలింపేటలో..

మండలంలోని మిక్కిలింపేట ప్రాథమిక పాఠశాలలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం తిరుపాల్, ఏఎన్‌ఎం కె.అనిత, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్, వలంటీర్ పి.పుష్పమ్మ పాల్గొన్నారు.

98 శాతం పంపిణీ

మనుబోలు : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని చిన్నారులు, విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మొదటి రోజు 98 శాతం మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు సీహెచ్‌ఓ రాజయ్య తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. 19 ఏళ్లలోపు వారు మండలంలో 6,137 మంది ఉండగా 6,032 మందికి(98 శాతం) ఆల్బెండజోల్–400 మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్ర మింగాలని సూచించారు. రెండేళ్లలోపు వారికి అర మాత్ర ఆపై వారు పూర్తి మాత్ర వేసుకోలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు గేయ పూజిత, మొహిసినా సుల్తానా, సూపర్‌వైజర్లు హైమావతి, వెంకటరమణయ్య, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

పాఠశాలల్లో..

పొదలకూరు : మండలంలోని పాఠశాలల్లో వైద్యాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు నరసింహారావు, రిషిత, కావ్య, స్రవంతి కార్యక్రమంలో పాల్గొని, నులి పురుగుల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు. పాఠశాలల్లో చేతులు శుభ్రం చేసుకునే పద్ధతిని వివరించారు.

• బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నులి పురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ రమణబాబు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ అలవాటు చేసుకుంటే శరీరంలో నులి పురుగులు పెరిగే ప్రమాదముందన్నారు. డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రామాంజనేయులు, ఎంఈఓలు రహీమ్, వై.చెంచులక్ష్మమ్మ, హెచ్‌ఎం నరసింహమూర్తి పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ నాగరాజు



పొదలకూరు : చేతుల శుభ్రతను వివరిస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారులు



పొదలకూరు : నులిపురుగుల మాత్రలను పిల్లలకు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



కోవూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో..



కొడవలూరు హైస్కూల్‌లో..



కొడవలూరు: మిక్కిలింపేటలో..



మనుబోలు : విద్యార్థికి డీవార్మింగ్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వైభవంగా కామాక్షితాయి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ కె.జయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి రామ శ్రీనివాస్

ఇందుకూరుపేట : స్థానిక సీడీపీఓ కార్యాలయంలో లోక్ అదాలత్ జడ్జి రామశ్రీనివాస్ శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులు, మహిళలకు సంబంధించిన చట్టాలు, బాల్య వివాహాల గురించి తెలియజేశారు. ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, డీటీ బషీర్, ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓ సునీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, జ్యోత్స్న పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

పొదలకూరు : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి బ్యాంక్ ఖాతా, ఏటీఎం నంబర్లు చెప్పకూడదని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు పేర్కొన్నారు. స్థానిక షాదీమంజిల్‌లో ఆర్బీఐ సౌజన్యంతో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత–సైబర్ మోసాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల బాధితులు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకొస్తే న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించ వద్దన్నారు. ట్రీస్ సంస్థ అధ్యక్షుడు నౌవరాజ్ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలను అలవాటు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరిగితే ఫిర్యాదులు చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇటీవల బాగా పెరిగాయని, బ్యాంకులకు సంబంధించి వివరాలను అపరిచితులకు వెల్లడించకూడదని తెలిపారు. నూజివీడుకు చెందిన ప్రసాద్‌బాబు బృందం పాదుపు, సైబర్ నేరాలపై కళాజాతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఏపీఎం రోజ్ మేరీ, సీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. పట్టణంలో పలు వార్డుల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల నియంత్రణకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందన్నారు. వీటిని ఉపయోగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు కాలువల్లో మురుగు తొలగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వ్యర్థ పదార్థాలను డ్రెయినేజీ కాలువల్లో వేయకుండా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో వీసీ సుందరవల్లి

వెంకటాచలం : హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన జాతీయ అడ్వెంచర్ క్యాంపులో పాల్గొన్న వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శుక్రవారం వీఎస్‌యూకు తిరిగొచ్చారు. వీరిని వీఎస్‌యూలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, జాతీయ అడ్వెంచర్ క్యాంపులకు హాజరై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో వీఎస్‌యూకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

నల్లపాళెంలో ఆరోగ్య సురక్ష



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు పర్యవేక్షణలో సురక్ష క్యాంపులో వైద్యపరీక్షలు చేశారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ తనిఖీ



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కోవూరు : మండలంలోని వేగూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీఓ రామాంజనేయులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి ఉన్నారు.

తిక్కవరప్పాడులో చోరీ

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన కొప్పోలు నారాయణ నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. నారాయణ తన నివాసానికి తాళం వేసి పనినిమిత్తం గురువారం ఉదయం నెల్లూరుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం తిరిగి తన నివాసానికి రాగా, తలుపులు పగులగొట్టి ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గుర్తించారు. నివాసంలో ఉన్న రూ.7 వేల నగదు చోరీ చేశారు. అలాగే పోస్టల్ కార్యాలయం తలుపులు పగులగొట్టి, అక్కడ నగదు లేక పోవడంతో వెళ్లిపోయారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కోవూరు : మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఇటీవల వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం బీఎల్‌ఓల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఎలక్షన్ డీటీ మధు, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, సుధా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య ఉన్నారు.

వాస్తవ ఘటనల సమాహారమే 'యాత్ర–2'

• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



యాత్ర–2 సినిమాను వీక్షిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : రాష్ట్రంలో జరిగిన వాస్తవ ఘటనల సమాహారమే యాత్ర–2 సినిమాగా రూపుదిద్దుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులోని జమునా సినీకాంప్లెక్స్‌లో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక షోను పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి కాకాణి వీక్షించారు. ముందుగా సంగంరోడ్డు సెంటర్‌లో కాకాణి రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సినిమా థియేటర్ వరకు ర్యాలీగా హాజరయ్యారు. సినిమా పూర్తయిన తరువాత హాలు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డైరెక్టర్ మహీ వీ రాఘవ్ అద్భుతంగా యథార్థ సంఘటనలతో సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. సమయం సరిపోనందున జగన్‌మోహన్‌రెడ్డి ఎదుర్కొన్న అవమానాలు, ఇబ్బందులను కొంతవరకు మాత్రమే చూపించగలిగారని ఆయనకు దగ్గరగా ఉన్న తనకు అన్ని విషయాలు తెలుసన్నారు. 125 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ అధిష్టానాన్ని ఢీకొన్న విధానం, సీబీఐ పేరుతో వారు పెట్టిన ఇబ్బందులను చక్కగా చూపారని, అయితే సినిమాలో చూపిన దానికంటే ఎక్కువ ఇబ్బందులను జగన్ ఎదుర్కొన్నట్లు మంత్రి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊహించని మెజారిటీతో విజయం సాధించి రెండో పర్యాయం జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. మంత్రి వెంట పార్టీ నేతలు పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, తెనాలి నిర్మలమ్మ, దాసరి భాస్కర్‌గౌడ్, ఎం.వెంకటశేషయ్య ఉన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవికుమార్

వెంకటాచలం: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ సూచించారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో జీవీఆర్ఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెంచురామారావు, ఉపాధ్యాయులు నరసింహారావు, కళాశాల అధ్యాపకులు జాకీర్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

• జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



పంట నమోదు వివరాలను పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి

ముత్తుకూరు: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి సూచించారు. మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఈ–పంట నమోదు, ఈకేవైసీ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వల్ల పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర పథకాలకు రైతులు అర్హత సాధిస్తారని తెలిపారు. అనంతరం ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు సామూహికంగా బ్రోమోడయోలిన్ మందు వినియోగించి పంటలను నష్టపరిచే ఎలుకలను నివారించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏడీఏ నర్సోజిరావు, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఎంఏఓ జోత్స్నరాణి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.